సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని ఇజ్జత్‌నగర్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా బుధవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఇజ్జత్‌నగర్ పరిసర ప్రాంతాలు, మినీ చార్మినార్ వద్ద విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా అయ్యప్పసొసైటీ, చంద్రనాయక్‌తండా పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా జవహర్ నవోదయ 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ సురేందర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ డీమార్ట్ బ్యాక్ సైడ్ ఏరియా, సాయిరాం కాలనీ, కంచె గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : జవహర్ నవోదయ ఎపిస్టెమ్ ఫీడర్ పరిధిలో.. బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జవహర్ నవోదయ ఫీడర్ పరిధిలోని డీ మార్ట్ బ్యాక్‌సైడ్, సాయిరాం కాలనీ, కంచ గచ్చిబౌలి, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎపిస్టెమ్ ఫీడర్ పరిధిలోని సాధన స్కూల్ బ్యాక్‌సైడ్ ఏరియా, ఎపిస్టెమ్ స్కూల్ ప్రాంతాలలో విద్యుత్‌సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

హఫీజ్‌పేట్‌లో..

హఫీజ్‌పేట్ : పాపిరెడ్డి, మదీనాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు హఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్ పూర్తిగా, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జయభేరి 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

గచ్చిబౌలి: జయభేరి 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఓల్డ్ గచ్చిబౌలి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

- జేవికాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జేవి కాలనీ, కేంద్రీయ విహార్ వంటి ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.


కరోనా పరీక్షలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఐదుగురికి కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ నిల్ అని వైద్యులు అరవింద్ పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్. 34 మందికి జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 34 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా జడ్జి 32 మందికి రూ.2 వేల చొప్పున, మరో ఇద్దరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బిర్యానీ @రూ.10



ప్రస్తుతం మార్కెట్‌లో చిన్నచిన్న టిఫిన్ సెంటర్లలో సైతం బిర్యానీ ప్లేట్ ధర రూ.30. మీల్స్ అయితే రూ.70 నుంచి 100కు పైనే. ఇలాంటి తరుణంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మహేష్ గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో కేవలం రూ.10కే వెజ్ బిర్యానీ అందిస్తున్నాడు. గతంలో అంబర్‌పేట్‌లో నడిపే వాడినని తెలిపాడు. అక్కడ తన కుటుంబ సభ్యులకు అప్పగించి దేవేందర్‌నగర్‌లో బిర్యాని సెంటర్ నడుపుతున్నానని పేర్కొన్నాడు. వచ్చే కొద్దిపాటి లాభాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నట్లు మహేష్ తెలిపాడు. ప్రతిరోజు 70 నుంచి 100 ప్లేట్ల వరకు అమ్ముతున్నాడు. అటుగా వెళ్లే వాహనాదారులు రూ.10కే వెజ్ బిర్యానీ బోర్డు చూసి ఒక పట్టు పట్టి వెళ్లిపోతున్నారు. – సుభాష్‌నగర్

రేపటి నుంచి ‘కంటి వెలుగు’

9 కేంద్రాల ఏర్పాటు.. రోజుకు 150 మందికి నేత్ర పరీక్షలు

రోజూ ఉదయం 9 నుంచి 4 గంటల వరకు..

శేరిలింగంపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘కంటి వెలుగు’ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి మండలంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కంటి పరీక్షలను నిర్వహించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి అన్ని పనిదినాల్లో కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. శని, ఆదివారాల్లో ఈ కేంద్రాలకు సెలవు. అదేవిధంగా సాధారణ, పండగ సెలవు దినాల్లో కేంద్రాలు పని చేయవని వైద్యాధికారులు తెలిపారు. మండలంలో కంటి వెలుగు పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజన తెలిపారు. మంగళవారం శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణ, శేరిలింగంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది, ఆశావర్కర్లు, ఆప్తోమెంట్రిస్ట్‌లు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

- శేరిలింగంపల్లి మండల పరిధిలో 9 కంటి వెలుగు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయి
- ఒక్కో కంటి వెలుగు పరీక్షా కేంద్రంలో మెడికల్ ఆఫీసర్, ఆప్తోమెంట్రిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు ఆశావర్కర్లు ఉంటారు.
- రోజుకూ 150 మందికి కంటి పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.
- 18 ఏళ్ళు పైబడిన వారికి మాత్రమే కంటి పరీక్షలను చేస్తారు.
- కంటి పరీక్షల కోసం వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డును తీసుకొని రావాల్సి ఉంటుంది.
- శనివారం, ఆదివారం ఈ కేంద్రాలు పని చేయవు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సృజన, వైద్యాధికారులు

శేరిలింగంపల్లి మండల పరిధిలో..

కాలనీ పేరు	కంటి వెలుగు కేంద్రం
అంజయ్యనగర్‌కాలనీ	నగర సంఘం కమ్యూనిటీ హాల్
కొత్తగూడ	కమ్యూనిటీ హాల్.
అయ్యప్పసొసైటీ	కల్చరల్ క్లబ్ హాల్‌లో
మయూరీనగర్ కాలనీ	కమ్యూనిటీ హాల్‌లో
చందానగర్	పీజేఆర్ స్టేడియం
జనప్రియనగర్	జనప్రియనగర్ కమ్యూనిటీ హాల్
భెల్ ఎంఐజీకాలనీ	సిర్కి ఆఫీస్ ప్రాంగణం
శేరిలింగంపల్లి	పట్టణ ఆరోగ్య కేంద్రం
రాయదుర్గం	వార్డు కార్యాలయ ప్రాంగణం

అందరూ సద్వినియోగం చేసుకోవాలి

రెండవ విడత కంటి వెలుగు పరీక్షలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. మండల పరిధిలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశాం. అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. రోజూ 150 మందికి కంటి పరీక్షలు చేస్తాం. కంటి పరీక్షలకు వచ్చే వారు విధిగా ఆధార్‌కార్డు తీసుకురావాల్సి ఉంటుంది.



–డా.శైలజ, వైద్యాధికారి, శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



శేరిలింగంపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం

రద్దీ ప్రాంతాలలో ఎల్లవేళలా గస్తీ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టీఫెన్ రవీంద్ర

- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర
- నేర నియంత్రణ, పోలీసు దర్యాప్తు తీరుతెన్నులపై సమీక్ష

రాయదుర్గం: కన్విక్షన్ల శాతాన్ని పెంచాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పోలీసులకు దిశానిర్దేశం చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో మంగళవారం నేరాల నియంత్రణ, పోలీసు దర్యాప్తు తీరుతెన్నులపై సీపీ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి, మాదాపూర్ జోన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బంది నేరాల సంఖ్యను తగ్గించే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోనే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, నార్సింగి తదితర ఐటీ కారిడార్‌లోని ప్రాంతాలు పెట్టుబడలకు ప్రత్యేక ఆకర్షణ ఉన్నందున నేర నియంత్రణ, శాంతి భద్రతలను అదుపులో ఉన్నట్లయితే పౌరులకు ఉపాధి కల్పన మరింతగా జరుగుతుందన్నారు. విజిబుల్ పోలీసింగ్, ప్రొయాక్టివ్ పోలీసింగ్ పద్ధతులు, రద్దీ ప్రాంతాలలో, కూడళ్లలో గస్తీ వాహనాలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా సెక్టార్ ఎస్ఐలు బేసిక్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కల్మేశ్వర్‌సింగన్వర్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, అడ్మిన్ డీసీపీ ఇందిర, సైబర్ క్రైమ్స్ అడిషనల్ డీసీపీ రితిరాజ, క్రైమ్స్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఎస్బీ ఏడీసీపీ రవికుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, డీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీయూ–టీఐఎఫ్ఆర్ ఒప్పందం

విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం



ఒప్పంద కార్యక్రమంలో వీసీ ప్రొ.బీజేరావు, ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: విద్య, పరిశోధనా రంగాలలో పరస్పర సహకారం అందిపుచ్చుకోవడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్–హైదరాబాద్ (టీఐఎఫ్ఆర్–హెచ్) మధ్య ఒప్పందం కుదిరింది.ఈ మేరకు మంగళవారం రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రంలో తమ సామర్థ్యాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్ళడానికి శ్రేష్టత, మానవ వనరుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపన్యాసాలు, వర్క్‌షాప్‌లు, సమావేశాలు, సెమినార్లు సంయుక్తంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్‌నిగమ్, ప్రొఫెసర్ జగన్ ఎంఆర్, టీఎఫ్ఐఆర్ నుంచి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఏ ఒక్కరూ కంటి సమస్యతో బాధపడకూడదన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు ప్రారంభించనున్నారని, గురువారం నుంచి ప్రారంభంకానున్న కంటి వెలుగును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కంటి వెలుగు ఏర్పాట్లపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని స్థాయిల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మంలో కంటి వెలుగును ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో కంటి వెలుగు నియోజకవర్గ ప్రత్యేక అధికారి డాక్టర్ మనోహర్ రెడ్డి, వివిధ స్థాయిల అధికారులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి



క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలు, అభివృద్ధి పనులపై విద్యుత్ అధికారులతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరుకున్న కరెంట్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. బస్తీలలో అవసరమైన చోట త్రీఫేజ్ కనెక్షన్ ఇవ్వాలని, ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని ఆదేశించారు. అలాగే రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించడం, ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేసి సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఈ వెంకన్న, సీజీఎం ఆనంద్, డీఈ గోపాలకృష్ణ, రాజు, చక్రవర్తి, ఏడీలు రాములు, ప్రసాద్, మల్లేష్, శ్యాం ప్రకాష్, కార్పొరేటర్లు హమీద్‌పటేల్ , నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సింధూ ఆదర్శ్‌రెడ్డి, శ్రీనికాంత్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, రంగారావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ అన్నారు. మంగళవారం కాకతీయనగర్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు విద్యుత్ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్‌సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇంట్లో విలువైన పరికరాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కాలనీవాసులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు మల్లేష్‌లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుంటాం

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని పీఈటీఈ పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. పాశంమైలారం పారిశ్రామికవాడలోని పీఈటీఈ (హామండ్ పవర్ సొల్యూషన్) పరిశ్రమలో కార్మికుల నూతన ఒప్పందంపై పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు.కార్మికులకు నూతన వేతనం రూ.11,652లకు ఒప్పందం కుదిర్చామన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ శైలేందర్ సింగ్, సిబ్బంది ముత్యాలు, నరసింహ శేఖర్, రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు, ప్రధాన కార్యదర్శి శివకుమార్, యునియన్ సభ్యులు రవి, కుమార్, శ్రీనివాస్, మాధవచారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల పారబోత.. జరిమానా



జరిమానా పత్రాన్ని అందిస్తున్న మున్సిపల్ అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ కుంట సమీపంలో వ్యర్థాలను పారబోస్తున్న ఓ పరిశ్రమ యాజమాన్యానికి మున్సిపల్ అధికారులు మంగళవారం జరిమానా విధించారు. మున్సిపల్ పరిధిలోని క్యాష్ అండ్ క్యారీ పరిశ్రమ నుంచి వ్యర్థ ఘన పదార్థాలను సమీపంలోని కుడికుంట సమీపంలో పారబోస్తుండటంతో కౌన్సిలర్ సంతోష గమనించి మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. దీనికి స్పందించిన మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ స్పందించి పారబోసిన వ్యర్థ పదార్థాలను వారితోనే తీసి వేయించి రూ.8,500లు జరిమానా విధించారు. చెత్తను ఇతర వ్యర్థాలను బహిరంగంగా పారబోయద్దని అధికారులు సూచించారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ శివాలయం కమిటీ హాల్‌లో గురువారం నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని కూకట్‌పల్లి డీసీ రవీందర్‌కుమార్ తెలిపారు. మంగళవారం బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డితో కలిసి కమిటీహాల్‌లో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తీర్థసి పాల్గొన్నారు.

ఉర్సు ఏర్పాట్లపై సమావేశం



దర్గాలో ముస్లిం నాయకులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్ యదవ్

పటాన్‌చెరు టౌన్: ఫిబ్రవరి 2, 3తేదీల్లో జరగబోయే ఉర్సులో భాగంగా మంగళవారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పలు ఏర్పాట్ల నిమిత్తం హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గాలో పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, పట్టణ మైనారిటీ ప్రెసిడెంట్ లియాకత్ అలీ, హజ్రత్ నిజాముద్దీన్ దర్గా అధ్యక్షులు వాజిద్ అలీ, నాయకులు హమీద్, మైనారిటీ ప్రెసిడెంట్ అజ్మత్ ఖురేషి, ఏఎంసీ డైరెక్టర్ అతిక్, అజ్మత్ యూత్ వైస్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పటాన్‌చెరుటౌన్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం.... మండలపరిధిలోని లక్డారంలో ఇద్దరు యువకులను గ్రామస్తులు కొడుతున్నారని సమాచారం రావడంతో ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లారు. సాయికుమార్, రాజుపై జరుగుతున్న దాడిని అడ్డుకున్నారు. వివరాలు తెలుసుకున్నారు. సాయికుమార్, రాజు, జోగన్న(24) సోమవారం రాత్రి మద్యం తాగారు. జోగన్న గుర్రలోల్ల కుంటలో పడిపోయాడు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు స్నేహితులు రాజు, సాయికుమార్ బయటకు తీసేందుకు ప్రయత్నించారు.ఎంతకీ బయటకు రాకపోవడంతో అక్కడే వదిలేసి ఎవరికీ కూడా చెప్పకుండా వెళ్లిపోయారు. తెల్లవారి చూసేసరికి జోగన్న అలియాస్ జగన్ అన్న చనిపోయి ఉండటంతో అతడి బంధువులు గ్రామస్తులతో కలిసి సాయికుమార్, రాజుపై దాడి చేశారు. పోలీసులు మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి పెంటయ్య తన కుమారుడిని రాజు, సాయికుమార్ హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సంక్రాంతి సంబురాలు



శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు మంగళవారం ముగిశాయి. గంగిరెద్దుల విన్యాసాలు, పిట్టలదొర, జంగమదేవరల మాటల గారడీ సందర్శకులను అలరించాయి. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భరత నాట్యాలయ గురువు చిత్ర నారాయణ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో స్వరాంజలి, గణేశ పంచరత్న, శ్లోకాలు, అమ్మవర్ణం ,తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు లక్ష్మీశరణ్య, అక్షిత, ఆర్వి, సుమేధ, శ్రేయ, విష్ణుప్రియ, సంజన, హన్సిక, వర్షిణి పాల్గొన్నారు. –మాదాపూర్





